RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:130

శుక్రవారం
మే 15, 2026

పేజీలు 8
వెల: రూ.3-00


లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

నాకు భర్త లేడు..
నేను ఒంటరిదానిని..
ఇల్లు కట్టుకోనివ్వండి..



2లో

## సంగారెడ్డిలో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి శ్రీకారం



- రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు
- స్థానిక మహిళలకు 1,500 ఉపాధి అవకాశాలు
- నేడు కేజేఎస్ యూనిట్2 శంకుస్థాపన

2లో

# టార్గెట్ బండి!

### సంజయ్‌ను ఇరుకునపెడుతున్న బీఆర్ఎస్
### భగీరథ్ పోక్సో కేసుతో రాజకీయ రణరంగం

- రాష్ట్రవ్యాప్తంగా గులాబీ శ్రేణుల భారీ ఆందోళనలు
- కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్
- కరీంనగర్‌లో కౌశిక్ రెడ్డి వివాదంతో మొదలైన రగడ
- కుమారుడి ఉదంతాన్ని అస్త్రంగా చేసుకున్న కారు పార్టీ
- గతంలో ఇరుకున పెట్టిన బండికి చెక్ పెట్టే వ్యూహం
- భవిష్యత్ ఎన్నికలకూ అడ్డు తొలగించుకునే ప్రయత్నం
- వచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్న గులాబీ దళం

2లో

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టిన సంజయ్ ను ఇరుకున పెట్టడానికి కారు పార్టీకి ఇదొక బలమైన అస్త్రంగా మారింది. ఈ ఇష్యూను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతుంటే, అటు బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. కరీంనగర్ వేదికగా మొదలైన ఈ ఉద్రిక్తతలు ఇప్పుడు రాష్ట్ర స్థాయి రాజకీయాలను కుదిపేస్తున్నాయి. చట్టపరమైన చర్యల మాట పక్కన పెడితే, బండి సంజయ్ రాజకీయ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడం ద్వారా వచ్చే ఎన్నికల నాటికి బీజేపీని బలహీనపరచడమే లక్ష్యంగా బీఆర్ఎస్ తన రాజకీయ చతురతను ప్రదర్శిస్తోంది. గతంలో తనను ఇరుకున పెట్టిన నేతపై ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తున్న ఈ ఎదురుదాడి రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.




## నీట్ రద్దుపై సీఎం రేవంత్ ఆందోళన

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు
- పారదర్శక దర్యాప్తు జరపాలని కేంద్రానికి విజ్ఞప్తి

2లో



# నేనింతే.. ఎవరికైనా చెప్పుకో!




**వేద న్యూస్, జమ్మికుంట**

హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని జమ్మికుంట మున్సిపల్‌లో అసలేం జరుగుతోంది? అనే చర్చ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల వద్ద జీతం పెంపు పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.80 వేల వరకు వసూలు చేసినట్టు వస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. అతనిదే రాజ్యం అన్నట్టుగా వ్యవహరిస్తున్నాడని కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు ఉద్యోగి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని, అయినప్పటికీ అధికారులు, పాలకవర్గం ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ వార్డు కౌన్సిలర్ ఈ వ్యవహారంపై ఆరా తీయగా, బాధిత ఉద్యోగులు తమకు జరిగిన విషయాలను వెల్లడించినట్టు తెలుస్తోంది. జీతాల పెంపు కోసం సుమారు 8 మంది డ్రైవర్ల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.80 వేల చొప్పున, మరో ఇద్దరు డ్రైవర్ల నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయితే సీనియార్టీ ప్రకారం జీతం పెంపునకు అర్హులైన ఇద్దరు ఉద్యోగులు తక్కువ మొత్తం చెల్లించడంతో వారిని పక్కనపెట్టి, ఎక్కువ మొత్తాలు ఇచ్చిన ఇతరులకు వేతనాల పెంపు మంజూరు చేసినట్టు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీంతో తాము అన్యాయానికి గురయ్యామని వారు వాపోతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులను ప్రశ్నించగా, సీనియార్టీ, డ్రైవింగ్ లైసెన్సుల ఆధారంగానే వేతనాల పెంపు ఇచ్చినట్టు పేర్కొన్నారని సమాచారం. అయితే ఉద్యోగుల నుంచి బహిరంగంగానే డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వస్తున్నప్పటికీ, జిల్లా స్థాయి అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఎవరికైనా చెప్పుకో.. నేనింతే అన్నట్టుగా సదరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వ్యవహరిస్తున్నాడని, అతనికి వ్యవస్థలో బలమైన పలుకుబడి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా 8 మంది నుంచి రూ.6 లక్షల 40 వేలు, మరో ఇద్దరి నుంచి రూ. లక్ష వసూలు చేసినట్టు ఆరోపణలు ఉండగా, మొత్తం రూ.7 లక్షల 40 వేల వ్యవహారంలో ఎవరి వాటా ఎంత అన్నది తేలాల్సి ఉంది. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని మున్సిపల్ ఉద్యోగుల శ్రమను దోపిడీ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.


### జమ్మికుంట మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి యాజాలం

- జీతాల పెంపు పేరిట భారీగా వసూళ్లు?
- సీనియార్టీ పక్కనపెట్టి జీతాల పెంపు ఇచ్చారనే విమర్శలు
- అధికారులు, పాలకవర్గం వత్తాసు పలకడంలో ఆంతర్యమేంటో?
- తోటి ఉద్యోగుల శ్రమ దోపిడీ.. ఎవరి వాటా ఎంతనో తేల్చేదెవరు?
- సదరు వ్యక్తి జమ్మికుంట మున్సిపల్‌లో అంత 'పవర్' ఫులా?
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ఉద్యోగుల డిమాండ్

## జ్యువెలరీ దోపిడీ కేసులో కీలక పురోగతి!

### ముగ్గురు నిందితుల అరెస్ట్

- బీహార్‌కు చెందిన సుబోధ్ సింగ్ ముఠాగా గుర్తింపు
- దోపిడీకి రెండు నెలల ముందే పలు జిల్లాల్లో రెక్కీ
- 161 తులాల బంగారం, వజ్రాలను ఎత్తుకెళ్లిన దుండగులు
- పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు ముమ్మరం



2లో

వేద న్యూస్

శుక్రవారం | మే 15, 2026

# సంగారెడ్డిలో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి శ్రీకారం

- రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు
- స్థానిక మహిళలకు 1,500 ఉపాధి అవకాశాలు
- నేడు కేజేఎస్ యూనిట్2 శంకుస్థాపన




**వేద న్యూస్, సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లాలో భారీ ఫుడ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో కేజేఎస్ యూనిట్–II పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిశ్రమ ద్వారా సుమారు 1,500 మంది స్థానిక మహిళలకు ఉపాధి లభించనున్నట్లు సమాచారం. కొండాపూర్ మండలం తొగర్పల్లి, అలియాబాద్ గ్రామాల పరిధిలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమకు నేడు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. పరిశ్రమ స్థాపనతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాజెక్టు సంగారెడ్డికి రావడంలో జగ్గారెడ్డి, నిర్మల కృషి కీలకంగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి సహకారంతో పరిశ్రమ సంగారెడ్డికి తరలివచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉండటంతో పారిశ్రామిక సంస్థలు తెలంగాణ వైపు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు మహిళల ఆర్థిక సాధికారతకు దోహదం కానుందని అధికారులు పేర్కొన్నారు. ఆహార ప్రాసెసింగ్ రంగంలో ఆధునిక సాంకేతికతతో పరిశ్రమ కార్యకలాపాలు కొనసాగనున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉపాధి లభించడం వల్ల గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. సంగారెడ్డి జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక అభివృద్ధి, ఉపాధి, మౌలిక సదుపాయాల విస్తరణకు ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులను జిల్లాకు తీసుకురావడానికి చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

# నీట్ పరీక్ష రద్దుపై సీఎం రేవంత్ ఆందోళన

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు
- పారదర్శక దర్యాప్తు జరపాలని కేంద్రానికి విజ్ఞప్తి

**వేద న్యూస్, హైదరాబాద్**



నీట్ యూజీ–2026 పరీక్ష రద్దు నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిపోయిందని పేర్కొన్నారు. పోటీ పరీక్షలు ప్రతిభకు వేదిక కావాల్సింది పోయి ఆందోళన, అస్థిరతకు కారణమవుతున్నాయని విమర్శించారు. మే 3న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించిన నీట్ యూజీ–2026 పరీక్షకు సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎం పేర్కొన్నారు. ఇప్పుడు పరీక్ష రద్దు కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, అవకతవకలు విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పరీక్షల విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడిన వ్యక్తులు, నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి స్థాయి, ప్రభావం ఎలా ఉన్నా చట్టపరమైన కఠిన శిక్షలు విధించాలని కోరారు. నీట్ పరీక్ష వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పారదర్శకంగా, వేగవంతంగా దర్యాప్తు జరపాలని సీఎం విజ్ఞప్తి చేశారు. వ్యవస్థలోని వైఫల్యాల కారణంగా అమాయక విద్యార్థులు మళ్లీ మళ్లీ నష్టపోకూడదని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో సాంకేతిక భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు నీట్ కోసం ఎంతో కష్టపడి, ఆర్థిక భారం భరిస్తూ సిద్ధమవుతున్నారని సీఎం గుర్తుచేశారు. కుటుంబాల ఆశలు, విద్యార్థుల శ్రమను ఇలాంటి ఘటనలు దెబ్బతీస్తున్నాయని తెలిపారు. పోటీ పరీక్షలు యువతకు అవకాశాల ద్వారంగా ఉండాలే తప్ప ఆందోళనకు కారణం కాకూడదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు అండగా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా వ్యవస్థలు, సాంకేతిక రక్షణ చర్యలు, సంస్థాగత బాధ్యతలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని నిలబెట్టడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

# నాకు భర్త లేడు.. నేను ఒంటరిదానిని.. ఇల్లు కట్టుకోనివ్వండి..

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

- ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో వృద్ధురాలికి అడ్డంకులు
- స్థలం మాదంటూ స్థానిక నేత కుమారుడి బెదిరింపులు
- రెండో విడత నిధులు ఆపించారంటూ బాధితురాలి ఆవేదన
- పోలీసులు, అధికారులు స్పందించాలని విజ్ఞప్తి
- వరంగల్‌లో వృద్ధ మహిళ కన్నీటి గాథ

వరంగల్ నగరంలో ఓ వృద్ధురాలి ఆవేదన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వరంగల్‌లోని వెంకట్రామ థియేటర్ సమీపంలోని పెట్రోల్ బంక్ పక్కన ఉన్న భగత్‌సింగ్ నగర్ కాలనీలో గత 19 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న జన్ను శాంతమ్మ అనే వృద్ధ మహిళ తనకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు కూడా అడ్డంకులు ఎదురవుతున్నాయని కన్నీటి పర్యంతమవుతూ మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. భర్త మరణించిన తర్వాత కూడా అదే స్థలంలో ఒంటరిగా జీవనం సాగిస్తున్న శాంతమ్మను ప్రభుత్వం గుర్తించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. మొదటి విడత బిల్లు కూడా విడుదల కావడంతో ఆ డబ్బులతో బేస్‌మెంట్ పనులు పూర్తి చేసి పిల్లర్లు వేసుకోవడంతో పాటు బోర్ కూడా తవ్వించుకున్నారు. ఇక గోడల నిర్మాణం ప్రారంభిద్దామని సిద్ధమవుతున్న సమయంలో స్థానిక రాజకీయ నాయకుడు, అతని కుమారుడు వచ్చి ఈ స్థలం మాది అంటూ తనను బెదిరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వృద్ధురాలు ఆరోపించారు. ఇదే విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా రెండో విడత ఇందిరమ్మ నిధులు విడుదల కాకుండా అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు చేసి డబ్బులు ఆపించారని కూడా ఆరోపణలు చేశారు. ప్రభుత్వ అధికారులు, పోలీసు యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకొని బాధితురాలు జన్ను శాంతమ్మకు న్యాయం చేయాలని, ఆమెకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొని అందులో గౌరవంగా జీవించేలా సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.



# టార్గెట్ బండి!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

- సంజయ్‌ను ఇరుకున పెడుతున్న బీఆర్ఎస్
- భగీరథ్ పోక్సో కేసుతో రాజకీయ రణరంగం
- రాష్ట్రవ్యాప్తంగా గులాబీ శ్రేణుల భారీ ఆందోళనలు
- కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్.
- కరీంనగర్‌లో కౌశిక్ రెడ్డి వివాదంతో మొదలైన రగడ
- కుమారుడి ఉదంతాన్ని అస్త్రంగా చేసుకున్న కారు పార్టీ
- గతంలో ఇరుకున పెట్టిన బండికి చెక్ పెట్టే వ్యూహం
- భవిష్యత్ ఎన్నికలకూ అడ్డు తొలగించుకునే ప్రయత్నం
- వచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్న గులాబీ దళం

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ‘బండి’ వర్సెస్ ‘బీఆర్ఎస్’ యుద్ధం పతాక స్థాయికి చేరింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ ఉదంతాన్ని అస్త్రంగా చేసుకున్న బీఆర్ఎస్ పార్టీ, బండి సంజయ్‌ను రాజకీయంగా ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టడమే కాకుండా, భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని నినదిస్తున్నాయి. కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ను తొలగించాలనే డిమాండ్‌తో కారు పార్టీ నేతలు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**కరీంనగర్‌లో మొదలైన రణరంగం..**

అసలు ఈ ఘర్షణ వాతావరణానికి బీజం కరీంనగర్‌లో పడింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని టార్గెట్ చేస్తూ బండి సంజయ్ వర్గీయులు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద గొడవకు దిగడంతో ఉద్రిక్తతలు మొదలయ్యాయి. ఈ దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ బంద్‌కు పిలుపునివ్వడంతో జిల్లా మొత్తం రణరంగంగా మారింది. ఈ ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలోనే బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద ఆయుధాన్ని అందించినట్లయింది. బండి వర్గీయులు చేసిన గొడవకు కౌంటర్ ఇచ్చే క్రమంలో భగీరథ్ కేసును బీఆర్ఎస్ ఇప్పుడు గట్టిగా వాడుకుంటోంది.

**బండి సంజయ్‌పై బీఆర్ఎస్ పగ?**

బండి సంజయ్‌ను బీఆర్ఎస్ ఇంతలా టార్గెట్ చేయడం వెనుక లోతైన రాజకీయ కోణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత సాధారణ ఎన్నికలకు ముందు బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తన పదునైన మాటలతో, పర్యటనలతో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఇరుకున పెట్టారు. ఒకానొక దశలో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేంతగా ఆయన ఊపు తీసుకువచ్చారు. అయితే, ఆయన్ను అధ్యక్ష పదవి నుంచి తప్పించాక బీజేపీ గ్రాఫ్ తగ్గి, కాంగ్రెస్ పుంజుకుందని, లేదంటే బీఆర్ఎస్‌కే మళ్లీ అవకాశం ఉండేదని రాజకీయ వర్గాల్లో ఇప్పటికీ చర్చ నడుస్తోంది. అప్పట్లో తనను ఇబ్బంది పెట్టిన బండికి ఇప్పుడు సరైన రీతిలో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పట్టుదలగా ఉంది.

**భవిష్యత్ ఎన్నికల వ్యూహం..**

ఢిల్లీ బీజేపీ పెద్దలు వచ్చే ఎన్నికలకు తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, రాష్ట్ర బీజేపీలో గళం వినిపించే బలమైన నేతగా బండి సంజయ్ నిలుస్తున్నారు. ఇప్పుడు ఆయన కుమారుడి కేసును అడ్డం పెట్టుకుని బండి సంజయ్‌ను రాజకీయంగా దెబ్బతీస్తే, వచ్చే ఎన్నికల నాటికి తమకు ఒక పెద్ద అడ్డంకి తొలగిపోతుందనేది బీఆర్ఎస్ అంతర్గత వ్యూహం. అందుకే చట్టం తన పని తాను చేసుకుపోతున్నా, బీఆర్ఎస్ మాత్రం ఈ అంశాన్ని ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకెళ్తోంది. బండి సంజయ్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడం ద్వారా అటు బీజేపీని, ఇటు సంజయ్‌ను రాష్ట్ర రాజకీయాల్లో బలహీనపరచడమే కారు పార్టీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

**ప్రజా మైలేజ్ కోసం బీఆర్ఎస్ పోరాటం**

భగీరథ్ విషయంలో బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనలకు ప్రజల నుంచి కూడా సానుకూల స్పందన వస్తోంది. సామాన్య ప్రజల్లో కూడా ఈ అంశం చర్చనీయాంశం కావడంతో బాధితురాలి తరపున పోరాటం చేసే పార్టీగా మైలేజీ దక్కింది. ఏది ఏమైనా గతంలో తనను ముప్పుతిప్పలు పెట్టిన బండి సంజయ్‌కు ఏ చిన్న అవకాశం దొరికినా వదలకూడదనే కసితో ఉన్న బీఆర్ఎస్, ఇప్పుడు భగీరథ్ కేసుతో బండి సంజయ్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ తన రాజకీయ చతురతను ప్రదర్శిస్తోంది. గతంలో ఎప్పుడెప్పుడు దొరుకుతాడా అని ఎదురుచూసిన బీఆర్ఎస్‌కు ఈ కేసు ఒక వరంలా మారిందని చెప్పవచ్చు.




# జ్యువెలరీ దోపిడీ కేసులో కీలక పురోగతి!

**వేద న్యూస్, కరీంనగర్**

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- బీహార్‌కు చెందిన సుబోధ్ సింగ్ ముఠాగా గుర్తింపు
- దోపిడీకి రెండు నెలల ముందే పలు జిల్లాల్లో రెక్కీ
- 161 తులాల బంగారం, వజ్రాలను ఎత్తుకెళ్లిన దుండగులు
- పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు ముమ్మరం



కరీంనగర్ పట్టణంలో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ భారీ దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా సుబోధ్ సింగ్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 13 మంది నిందితులను గుర్తించామని, పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు వివిధ రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాయని తెలిపారు. ఈ నెల 3న జరిగిన దోపిడీలో దుండగులు జ్యువెలరీ షాపులోకి చొరబడి కాల్పులకు తెగబడటంతో నలుగురు ఉద్యోగులకు బుల్లెట్ గాయాలయ్యాయి. అనంతరం 161 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాలను దోచుకెళ్లారు. ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్ అని, ప్రస్తుతం అతను బీహార్‌లోని పూర్నియా జైలులో ఉంటూనే ఈ దోపిడీకి పథక రచన చేసినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన రఘునాథ్ కర్మకార్‌తో పాటు రవిష్ కుమార్, మెహతాబ్ ఖాన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు షూటర్లు కాగా, మరొకరు సహాయకుడిగా వ్యవహరించినట్లు గుర్తించారు. నిందితులు దోపిడీకి రెండు నెలల ముందే ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి, భద్రతా లోపాలను గమనించి కరీంనగర్‌లోని షోరూమ్‌ను లక్ష్యంగా ఎంచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. దోపిడీ అనంతరం నిందితులు బైక్‌లపై ధర్మపురికి చేరుకుని, అక్కడి నుంచి మూడు బృందాలుగా విడిపోయి రైళ్లు, బస్సుల ద్వారా పరారైనట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.51 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఈ ముఠాపై దోపిడీ కేసులు ఉన్నాయని, తెలంగాణలో ఇంత భారీ స్థాయిలో దోపిడీ చేయడం ఇదే తొలిసారి అని కమిషనర్ గౌస్ ఆలం పేర్కొన్నారు. ప్రస్తుతం జైలులో ఉన్న ప్రధాన నిందితుడు సుబోధ్ సింగ్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు కోర్టు అనుమతి కోరనున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని, దోచుకెళ్లిన సొత్తు రికవరీకి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.



# ఛత్రపతి శంభాజీ మహారాజ్ జయంతి వేడుకలు

## రుద్రూర్‌లో చిత్రపటానికి నివాళులు

**వేద న్యూస్, రుద్రూర్**

రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ ఛత్రపతి శివాజీ చౌక్ వద్ద శుక్రవారం రాత్రి ఛత్రపతి శివాజీ మహారాజ్ పుత్రుడు, మరాఠా సామ్రాజ్య యోధుడు శంభాజీ మహారాజ్ జయంతి వేడుకలను హిందూ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. శంభాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హైందవ సామ్రాజ్య స్థాపనలో శంభాజీ మహారాజ్ కీలక పాత్ర పోషించారని, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుకు సింహస్వప్నంగా నిలిచి మరాఠా స్వరాజ్యాన్ని రక్షించారని కొనియాడారు. జయంతి సందర్భంగా ఆయన త్యాగాలు, ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రశాంత్ గౌడ్, కుమ్మరి గణేష్, కృష్ణంరాజు, ఎముల గజేందర్, బెజగం వెంకటేష్, మాజీ విండో చైర్మన్ పత్తి రాము, బీఆర్ఎస్ నాయకులు కొత్తపల్లి రవికిరణ్, తాటిపాముల హరీష్, అడప నవీన్, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేద న్యూస్
శుక్రవారం మే 15, 2026

# ఘనంగా మాజీ ఉపసర్పంచ్ సందీప్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వేద న్యూస్, వెల్గటూర్ :**

ఆడంబరాలకు దూరంగా, సామాజిక సేవయే పరమావధిగా వెల్గటూర్ మాజీ ఉపసర్పంచ్ గుండాటి సందీప్ రెడ్డి తన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని, మండల కేంద్రంలోని ఉపాధి హామీ కూలీలకు అండగా నిలిచారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా, గ్రామ శివారులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు స్వయంగా వెళ్లి వారికి చల్లని మజ్జిగ, అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి మాట్లాడుతూ.. తన పుట్టినరోజున ఇలా కష్టపడి పని చేసే కూలీల మధ్య గడపడం, వారికి చిన్నపాటి సాయం చేయడం సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. అట్టహాసంగా వేడుకలు చేసుకోకుండా, ఎండలో అలమటిస్తున్న కూలీల దాహార్తిని తీర్చడంపై స్థానికులు, కూలీలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు గండ్ర ప్రతాప్ రావు, మాజీ సర్పంచ్ మెరుగు మురళీ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్, వార్డ్ సభ్యులు నక్క సురేష్, వీరా, నాని పాల్గొన్నారు. అలాగే గణి యూత్ సభ్యులు వెలగందుల సంతోష్, లకుమల్ల సాయి, కొండ లక్ష్మీనారాయణ, గుమ్ముల అజయ్, పందిరి వెంకటేష్, కస్తూరి హరి, మ్యాకల వికాస్, ఇప్ప సిద్ధూ, ప్రేమ్ సాగర్, గుమ్ముల రాహుల్, మోతె సాయి, పోతు శ్రీకాంత్, కడియాల రాహుల్ తదితరులు పాల్గొని సందీప్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ధర్మపురి అభివృద్ధికి బాటలు

- 5వ వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- ప్రజల సౌకర్యార్థం మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుంది: మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి



**వేద న్యూస్, ధర్మపురి :**

ధర్మపురి పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని 5వ వార్డులో ప్రజల చిరకాల వాంఛ అయిన నూతన డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను, ప్రజల రవాణా కష్టాలు తీర్చేందుకు సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులోనూ ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని, అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ ముదుసుల ప్రశాంత్, ప్రముఖ నాయకులు సంగి నర్సయ్య, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తమ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి వలసలు



- మునిగేపల్లి సర్పంచ్ సహా 50 కుటుంబాల చేరిక

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలంలో అధికార పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. మునిగేపల్లి సర్పంచ్ గంగా స్రవంతి తన అనుచరులతో కలిసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐదు నెలల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన గంగా స్రవంతి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఆమెతో పాటు ఐదుగురు వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు అండగా నిలుస్తాం

- అసోసియేషన్ ప్రతినిధులు
- జిల్లా వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శన



**వేద న్యూస్, హనుమకొండ :**

ఉమ్మడి వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు అసోసియేషన్ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి తాబేటి రాజేంద్రం, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ పొందుతున్న క్రీడాకారులు మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు విద్య, ఉపాధి అవకాశాల్లో మంచి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. క్రీడలతో పాటు చదువుపై కూడా దృష్టి పెట్టి ఉద్యోగ లక్ష్యాలను సాధించాలని సూచించారు. అంతకుముందు శిక్షణ శిబిరంతో పాటు ప్రతిరోజూ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న కోచ్ వినయ్ సేవలను అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు అవసరమైన బ్యాట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తాబేటి సతీష్, క్రీడాకారులు పవన్, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



**వేద న్యూస్, వెల్గటూర్ :**

రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, సాగులో ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వృద్ధుల మరియు వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం వెల్గటూర్ మండలంలోని పలు వరి కొనుగోలు కేంద్రాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముంజంపల్లి, మారేడుపల్లి మరియు ఉండెడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ ఎ. అనిల్ కుమార్, ఏఎంసీ చైర్మన్ గోళ్ల తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ధాన్యం సేకరణ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించడమే కాకుండా, కేంద్రాల్లో రైతులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతులతో వారు నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తూకం పద్ధతులు మరియు ప్రభుత్వం కల్పిస్తున్న గిట్టుబాటు ధరపై రైతులకు అవగాహన కల్పించారు. కేంద్రాల్లో రైతులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏదైనా ఇబ్బంది తలెత్తితే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముంజంపల్లి సర్పంచ్ సింగిరెడ్డి లింగారెడ్డి, మారేడుపల్లి సర్పంచ్ బాలసాని శారదా మల్లేశం, ఉండెడ సర్పంచ్ ఆవుల మమతా తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ పోలోజు శ్రీను, కాంగ్రెస్ నాయకులు మన్నే జీతేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

- రిబ్బన్ కట్ చేసిన సర్పంచ్ బోనగిరి అజయ్ కుమార్
- విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపు



**వేద న్యూస్, ధర్మారం :**

విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు బాహ్య ప్రపంచం పై అవగాహన పెంచుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని కటికనపల్లి గ్రామ సర్పంచ్ బోనగిరి అజయ్ కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికనపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని గురువారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రతి విద్యార్థి రోజుకు కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోవధ, అక్రమ గో రవాణా అరికట్టాలి

- బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి
- జిల్లా ఎస్పీకి విశ్వహిందూ పరిషత్ వినతిపత్రం



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**

ముక్కోటి దేవతల స్వరూపమైన గోమాతను రక్షించాలని, హిందువుల మనోభావాలను గౌరవించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ నాయకులు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమంగా గోవులు, కోడెల రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. గోవధ నివారణకు కఠిన చర్యలు తీసుకుని హిందువుల విశ్వాసాలను కాపాడాలని కోరారు. అలాగే దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన రాజరాజేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న గోవధ కేంద్రాలను తొలగించి కోట్లాది మంది హిందువుల మనోభావాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు గడప కిషోర్ రావు, నాగుల రాము గౌడ్, శ్రీనివాస్, లక్ష్మన్, మహేష్, కమలాకర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# 9వ వార్డులో మంచినీటి వసతుల కల్పన

**వేద న్యూస్, దేవరకద్ర/ఆత్మకూర్:**



- బోరుకు మోటార్ ఏర్పాటు

మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు గురువారం 9వ వార్డులో బోరులో కరెంట్ మోటార్ ఏర్పాటు చేసి మంచినీటి వసతులు కల్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జి. నాగమణి, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్ సద్దల తులసి వెంకట్‌రాములు, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు 9వ వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వేద న్యూస్

శుక్రవారం మే 15, 2026

# పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక వేధింపులు

- సస్పెన్షన్ ఎస్ఐ సురేశ్ అరెస్ట్
- మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు




**వేద న్యూస్, మల్కాజ్ గిరి:**

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించాడంటూ ఓ మహిళ చేసిన ఫిర్యాదుతో ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న ఎస్ఐ సురేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు బాలానగర్ ఏసీపీ నరేశ్‌రెడ్డి తెలిపారు. కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న సురేశ్‌పై మహిళ చేసిన ఆరోపణలపై విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.

# కిరాణా షాపుల ముసుగులో బెల్ట్ షాపులు

- దేవాలయాలు, విద్యాసంస్థల సమీపంలో మద్యం విక్రయాలు
- చూసీ చూడనట్లుగా ఎక్సైజ్, పోలీస్ అధికారులు
- కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కొన్ని కిరాణా షాపుల ముసుగులో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుపుతూ మందుబాబుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాలు, దేవాలయాలు, విద్యాసంస్థల సమీపంలో బెల్ట్ షాపులు కొనసాగుతుండటంతో యువతపై చెడు ప్రభావం పడుతోందని పలువురు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో కొందరు దేవాలయాల వద్ద, రోడ్ల పక్కన విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్, పోలీస్ శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కిరాణా షాపుల పేరుతో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై ప్రత్యేక దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

- ఒకటి, ఐదు తరగతుల్లో ప్రవేశాలకు అవకాశం
- జూన్ 6 వరకు దరఖాస్తుల సమర్పణ
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటన

**వేద న్యూస్, మంచిర్యాల :**



2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం కింద ఒకటి, ఐదో తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఒకటో తరగతికి 91 సీట్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐదో తరగతికి 92 సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి జూన్ 6 సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులను నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కుటుంబంలో ఒక అభ్యర్థికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు జనన ధ్రువీకరణ పత్రం, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు ప్రతులు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, మార్కుల జాబితా ప్రతులు సమర్పించాలని తెలిపారు. అన్ని నకలు ప్రతులపై గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలని సూచించారు. జిల్లాలోని అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# 'ఆక్రమణల'పై ఉక్కుపాదం..!

- ట్రాఫిక్ ఆటంకాలపై మున్సిపల్ అధికారుల ఉక్కుపాదం
- కృష్ణవేణి చౌరస్తా నుంచి నదీఅగ్రహారం వరకు ఆక్రమణల తొలగింపు

**వేద న్యూస్, గద్వాల :**



గద్వాల జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా యంత్రాంగం కదిలింది. పట్టణంలోని ప్రధాన రహదారులను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలతో గురువారం ఉదయం నుంచే మున్సిపల్, పోలీసు మరియు రెవెన్యూ విభాగాల అధికారులు భారీ బందోబస్తు మధ్య రంగంలోకి దిగారు. గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని అత్యంత రద్దీగా ఉండే కృష్ణవేణి చౌరస్తా నుంచి నదీఅగ్రహారం వెళ్లే ప్రధాన రహదారిపై ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన శాశ్వత కట్టడాలు, అడ్డంగా ఉన్న డబ్బాలు, షెడ్లను జేసీబీల సహాయంతో తొలగించారు. కొద్దిరోజులుగా ఈ ఆక్రమణల వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ, పట్టణంలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారులను వెడల్పుగా ఉంచడం అత్యవసరమని పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌లు ఖాళీగా ఉంటేనే పాదచారులు సురక్షితంగా నడవగలరని, రహదారులపై ఆక్రమణలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు, వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో చేపట్టిన ఈ చర్యలతో ప్రధాన రహదారులు ఇప్పుడు విశాలంగా కనిపిస్తున్నాయి. నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో నరకం చూస్తున్న పట్టణ ప్రజలు అధికారుల నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణల తొలగింపు అనంతరం తిరిగి అక్కడ వ్యాపారాలు సాగకుండా కఠిన నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# వారసత్వం పట్టా కోసం రూ.10 వేలు డిమాండ్

- లంచం తీసుకుంటూఏసీబీకి చిక్కిన ఆర్ఐ
- దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో ఘటన



**వేద న్యూస్, దుగ్గొండి :**

దుగ్గొండి మండలం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించి లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మండలంలోని మధిర గ్రామానికి చెందిన లొల్లాటి రాజు తన తండ్రి నర్సయ్య మృతితో, ఆయన పేరిట ఉన్న 27 గుంటల వ్యవసాయ భూమిని తన పేరుపై పట్టా చేసుకునేందుకు వారసత్వ నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే సంబంధిత ఫైల్‌ను ముందుకు జరిపేందుకు ఆర్ఐ రూ.10 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. దీనిపై బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కా ప్రణాళికతో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో దాడి నిర్వహించారు. లంచం స్వీకరిస్తున్న సమయంలో ఆర్ఐను అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించిన అధికారులు సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనతో తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. కేసు నమోదు చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వైభవంగా తిరుపతమ్మ కల్యాణం

- దర్శనానికి పోటెత్తిన భక్తులు - డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగింపు



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండలం ఆమనగల్లులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో తిరుపతమ్మ కళ్యాణ మహోత్సవాన్ని డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో ఆలయ నిర్మాణకర్తలు లక్ష్మి-వెంకటేష్ దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూలతో అలంకరించింన మండపంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య కల్యాణ వేడుకలు వైభవంగా సాగాయి. గ్రామ ప్రజలు, మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుపతమ్మ-గోపయ్య స్వామివారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారిని ఊరేగించారు. మహిళలు హారతులు పట్టి మొక్కులు చెల్లించగా, యువకులు భజనలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లల సందీప్, మాజీ సర్పంచ్ పేరాల కృపాకర్ రావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బంటు చొక్కయ్య గౌడ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి
- తిరుమలయ్యపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**వేద న్యూస్, దేవరకద్ర:**

మదనపురం మండలం తిరుమలయ్యపల్లి గ్రామంలో గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించేలా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని, ఆయన ఆశయ సాధన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం మే 15, 2026

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే గ్రామ భవిష్యత్తుకు పునాది



- సర్పంచ్ తెలుగు శివకుమార్
- గ్రామంలో జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభం

**వేద న్యూస్, చిన్నచింతకుంట :**

చిన్నచింతకుంట మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఉన్నత ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఫరీద్‌పూర్ గ్రామంలోని ఎం.పీ.యూ.పి.ఎస్ పాఠశాలలో ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని సర్పంచ్ తెలుగు శివకుమార్ ప్రధానోపాధ్యాయులు, ఉప సర్పంచ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, వారానికి మూడు గుడ్లు, రాగి జావ, ఉచిత ఆరోగ్య పరీక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏఐ ఆధారిత బోధనతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ఒకటి నుంచి మూడో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, నాలుగో నుంచి ఎనిమిదో తరగతి వరకు తెలుగు మీడియంలో బోధన జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే గ్రామ భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు నేపాల్, వెంకట్‌రెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి
- ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**వేద న్యూస్, దేవరకద్ర భూత్పూర్ :**

భూత్పూర్ మండల పరిధిలోని పెద్దతండా, కొత్తూరు, షేర్‌పల్లి, హస్నాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి విడతల వారీగా రూ.5 లక్షలు వారి ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. లబ్ధిదారులు కూడా తమ వంతు సహకారంతో అన్ని వసతులతో ఇళ్లు నిర్మించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. నిరుపేద ప్రజల సొంతింటి కల ప్రజాపాలనలో సాధ్యమైందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి యువతకు గోల్డెన్ ఛాన్స్

- సర్పంచ్ టోనీ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ

**వేద న్యూస్, కారేపల్లి :**



సింగరేణి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పిల్లలు, యువత కోసం ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మేదరి టోనీ తెలిపారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా గ్రామ యువత కోసం ఈ ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 6 నుంచి 30 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు, పురుషులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తిగా ఉచితంగా శిక్షణ అందించడం పట్ల గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కరాటే ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని సర్పంచ్ టోనీ అన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవడం అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా యువతకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

# నూతన వధువుకు రూ.10,116 కానుక

**వేద న్యూస్, గంగాధర :**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాసేవలో ముందుంటామని గంగాధర సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన బూర్ల అనూష వివాహ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తన ఎన్నికల హామీలో భాగంగా సొంత నిధుల నుంచి రూ.10,116 నగదును పెళ్లి కానుకగా వధువు కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. పేద కుటుంబాలపై పెళ్లిళ్ల భారం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. సమయానికి ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్‌కు వధువు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి మహేందర్, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



- ఎన్నికల హామీ నిలబెట్టుకున్న భాగ్యలక్ష్మి

# తాలు-తేమ పేరుతో ఇబ్బంది పెడితే చర్యలు

- పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ రవీందర్ హెచ్చరిక
- గంగిరేణిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వేద న్యూస్, శాయంపేట :**



రైతులను తాలు, తేమ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపెల్లి రవీందర్ హెచ్చరించారు. గంగిరేణిగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాధిక, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, సర్పంచులు కుమారస్వామి, హింగే భాస్కర్, చిందం రవి, శానం కుమారస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూ.కాలేజీలో ఇంటర్ విద్యా వారోత్సవాలు




**వేద న్యూస్, శాయంపేట :**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇంటర్ విద్య వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగో రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పేరెంట్‌టీచర్ సమావేశం, పూర్వ విద్యార్థుల సమ్మేళనం, ఆరోగ్య అవగాహన సదస్సు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతల ఉమా రవిపాల్, వార్డు సభ్యురాలు కురాకుల మంజుల, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ దాసరి కల్పన, మెడికల్ ఆఫీసర్ సాయి కృష్ణ, పారా మెడికల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. గిద్దమారి సురేష్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, మచ్చ గిరిస్వామి దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి, ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్ పాల్గొన్నారు.

# రాజ్యనిర్బంధాన్ని ప్రశ్నించిన హక్కులనేత బుర్ర రాములు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



ప్రజలపై రాజ్యం చేసే ఆకృత్యాలను హక్కుల ఉల్లంఘనను ప్రశ్నించి ఎదిరించి నిలబడ్డ ప్రజల మనిషి డాక్టర్ బుర్ర రాములు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఖిలా వరంగల్ కోట సెంటర్లో మానవ హక్కుల నేత డాక్టర్ బుర్ర రాములు 15వ యాది సభను జిల్లా హక్కుల నేతలు ప్రజాస్వామికవాదులు వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా జరిపారు. ముందుగా బుర్ర రాములు చిత్రపటానికి ఆయన కుటుంబ సభ్యులు మరియు ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం రెండు నిమిషాలు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించి జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, టి పి టి ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కడారి భోగేశ్వర్, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, బుర్ర రాములు కూతురు జన మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు పాలకుర్తి సత్యం, సాదు రాజేష్, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ తదితరులు మాట్లాడారు. డాక్టర్ బుర్ర రాములు విద్యార్థి దశ నుండే ప్రగతిశీల భావాలు కలిగి విప్లవ విద్యార్థి సంఘ నిర్మాణానికి కృషి చేశాడని అదే క్రమంలో కాకతీయ యూనివర్సిటీలో లెక్చరర్ గా పని చేస్తూ పౌర, మానవ హక్కుల సంఘాలలో రాష్ట్ర నాయకులుగా పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న హక్కుల ఉల్లంఘనను ప్రశ్నించేవాడని అన్నారు .దేశవ్యాప్తంగా వివిధ సామాజిక ఉద్యమాలపై నాటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన నిర్బంధాన్ని నిజ నిర్ధారణ కమిటీల ద్వారా సమాజానికి తెలిపేవాడని అన్నారు .నాటి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను బట్ట బయలు చేసేవాడని ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీ ల ప్రభుత్వాలు చేసిన బూటకపు ఎన్కౌంటర్లను తమ సంఘ నిజనిర్ధారణ కమిటీ ద్వారా వాస్తవ విషయాలను ప్రజలకు తెలియపరచాడన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడి చేస్తున్నద అన్నారు. భూపరాయికరణ ఆదివాసీ హక్కుల ఖననం మైనారిటీ ప్రజలపై దాడులు హత్యలు సర్వ సాధారణంగా మారిపోయాయని అన్నారు. ప్రజల హక్కుల రక్షణ కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించుటకు పని చేయడమే డాక్టర్ బుర్ర రాములు కు మనం అందించే ఘనమైన నివాళి అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ యాదవ్,వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తీగల జీవన్, న్యాయవాది మైదం జయపాల్ నలిగింటి పాల్, బెల్లంకొండ రమేష్,పూర్ణచందర్, గద్దల సంజీవ, బండి వెంకటేశ్వర్లు, భైరబోయిన ఐలయ్య, మైదంపాణి ఆర్ కృష్ణ, ప్రభాకర్ లతోపాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేలిన యూపీఎస్

- వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఘటన
- భయాందోళనకు గురైన ఉద్యోగులు
- తాత్కాలికంగా నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు

**వేద న్యూస్, వేములవాడ:**



వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం కంప్యూటర్ వ్యవస్థకు సంబంధించిన యూపీఎస్ అకస్మాత్తుగా పేలిపోవడంతో ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. భారీ శబ్దం రావడంతో సిబ్బంది కార్యాలయం బయటకు పరుగులు తీశారు. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. యూపీఎస్ పేలడంతో విద్యుత్ సరఫరా, కంప్యూటర్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడి రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సబ్ రిజిస్ట్రార్ విజయభాస్కర్ తెలిపారు. సాంకేతిక నిపుణులు మరమ్మత్తులు పూర్తి చేసిన తర్వాత మాత్రమే స్లాట్‌లు బుక్ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. మరమ్మత్తుల అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పునఃప్రారంభమవుతుందని తెలిపారు.

వేద న్యూస్

శుక్రవారం మే 15, 2026

# రికార్డుల్లో లేని ఇళ్లు.. పిల్లిగుండ్ల కాలనీవాసుల అవస్థలు..!?

**వేద న్యూస్, గద్వాల :**



గద్వాల పురపాలక సంఘం పరిధిలోని 7వ వార్డు పిల్లిగుండ్ల కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 500కు పైగా గృహాలు ఉన్న ఈ కాలనీలో, ఇప్పటికీ ఇళ్లను మున్సిపల్ ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్నప్పటికీ, అధికారికంగా గుర్తింపు లేకపోవడంపై వారు అధికారుల తీరును తప్పుబడుతున్నారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో ఒకటైన ఈ కాలనీలో కనీసం ఇంటి నంబర్లు కూడా కేటాయించలేదు. దీనివల్ల కాలనీవాసులకు పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇంటి నంబర్లు లేకపోవడంతో రేషన్ కార్డులు, పెన్షన్లు, మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం అసాధ్యంగా మారింది. చిరునామా మార్పులు చేసుకోవడానికి, కొత్తగా గుర్తింపు కార్డులు పొందడానికి పిల్లిగుండ్ల కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఇళ్లు ఉన్నా, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి రికార్డుల్లో ఎందుకు నమోదు చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు కాకపోవడంతో తమ ఇళ్లకు ఎటువంటి చట్టబద్ధత లేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మేము ఇక్కడ ఇళ్లు కట్టుకుని ఏళ్లు గడుస్తున్నా, మున్సిపల్ రికార్డుల్లో మా ఉనికి లేకపోవడం దారుణం. ఇంటి నంబర్ లేక చిరునామా ధ్రువీకరణ పత్రాల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది"అని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కాలనీలో సమగ్ర సర్వే నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఇంటికి మున్సిపల్ నంబర్లు కేటాయించాలని కాలనీవాసులు జిల్లా కలెక్టర్‌ను మరియు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**వేద న్యూస్, హనుమకొండ :**

అపరిష్కృతంగా ఉన్న బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వాటిని పార్లమెంటులో ప్రస్తావించి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. గురువారం అఖిల భారతీయ భారతీయ స్టేట్ బ్యాంకు సిబ్బంది సమాఖ్య హైదరాబాద్ వలయం, వరంగల్ విభాగం నాయకులు ఎంపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉప ప్రధాన కార్యదర్శి సీహెచ్ సంతోష్‌కుమార్, సహాయ ప్రధాన కార్యదర్శులు కె రాజేందర్‌సింగ్, ఎం రవీందర్‌రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి కె కుమారస్వామి మాట్లాడుతూ బ్యాంకుల్లో సాయుధ భద్రతా సిబ్బంది నియామకం చేపట్టాలని కోరారు. ఎన్‌పీఎస్ ఉద్యోగులకు పెన్షన్ నిధి నిర్వహణాధికారి మార్పు అవకాశం కల్పించాలని, 2019లో చేరిన ఉద్యోగులకు అంతర్వలయ బదిలీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాశ్వత ఉద్యోగాల ఔట్‌సోర్సింగ్ విధానాన్ని నిలిపివేయడంతో పాటు ఖాళీలను భర్తీ చేయాలని, ఎస్‌బీఐలో సమానత్వ సమస్య పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ పురోగతి పథకాన్ని సమీక్షించడంతో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు 8వ స్థబ్దత పెరుగుదల అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వైద్య ఖర్చుల తిరిగి చెల్లింపు పథకాన్ని మెరుగుపరచాలని, మానవ వనరుల నిర్వహణ వ్యవస్థ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ నెల 25, 26 తేదీల్లో దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చామని, ఆ రోజుల్లో విధులకు హాజరు కాబోమని సంఘ నాయకులు తెలిపారు. 23, 24 తేదీల్లో సెలవులు, 27న బక్రీద్ సందర్భంగా బ్యాంకులకు సెలవు ఉండటంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ కార్యకలాపాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందన్నారు. ఖాతాదారులు ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీ కడియం కావ్య బ్యాంకు ఉద్యోగుల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



- ఎంపీ కడియం కావ్య

# వన్యప్రాణులను హతమార్చితే కఠిన చర్యలు

- డిప్యూటీ రేంజర్ కోటేశ్వరరావు
- మృతిచెందిన కొండ చిలవ పరిశీలన



**వేద న్యూస్, శాయంపేట :**

శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో కోళ్లపారం సమీపంలో రోడ్డుపై కొండచిలువ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యుడు మారపెల్లి సునీల్ ద్వారా డిప్యూటీ రేంజర్ వై. కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కొండచిలువ తల భాగం పూర్తిగా దెబ్బతినడంతో గుర్తుతెలియని వాహనం దానిపై నుంచి వెళ్లి ఉండొచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజర్ మాట్లాడుతూ.. వన్యప్రాణులను తెలిసి గానీ, తెలియక గానీ చంపడం నేరమన్నారు. పత్తిపాక ప్రాంతంలో గుట్టలు, చెరువులు, కుంటలు ఉండటంతో వన్యప్రాణుల సంచారం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. వాహనదారులు రోడ్డు దాటుతున్న వన్యప్రాణులను గమనించి అవి వెళ్లిన తర్వాతే వాహనాలు ముందుకు నడపాలని సూచించారు. వన్యప్రాణుల మరణానికి కారణమైతే వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తిరుపతమ్మ-నాగులమ్మ తల్లిని దర్శించుకున్న సర్పంచ్

**వేద న్యూస్, నల్లగొండ ప్రతినిధి :**



వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుపతమ్మనాగులమ్మ అమ్మవార్ల దేవాలయాన్ని గ్రామ సర్పంచ్ పిల్లల సందీప్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సూర్యనారాయణ శర్మ సర్పంచ్‌కు స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బంటు చొక్కయ్య గౌడ్, నాయకులు వల్లంపట్ల వెంకన్న, పెరుమండ్ల నగేష్, బచ్చు జానయ్య, కొడిదల శంకర్, వంగాల ఈశ్వర్, రామకోటి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ రవీంద్రచారి అకాల మృతి

- కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

**వేద న్యూస్, కారేపల్లి :**

సింగరేణి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గంగాధరణి రవీంద్రచారి (38) అకాల మరణం గ్రామంలో విషాదాన్ని నింపింది. వెన్నెముక సమస్యతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న రవీంద్రచారి పేద కుటుంబానికి చెందినవాడు. రోజువారీ సంపాదనతో జీవనం సాగిస్తున్న ఆయన మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. మృతుడికి భార్య సౌజన్య, కుమారుడు సాత్విక్ ఉన్నారు. కుటుంబ పోషణ బాధ్యత మొత్తం రవీంద్రచారిపైనే ఉండటంతో ఆయన మృతి గ్రామ ప్రజలను కలచివేసింది. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు స్పందిస్తూ పేద కుటుంబానికి చెందిన రవీంద్రచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. రవీంద్రచారి మృతి పట్ల గ్రామ ప్రజలు, స్నేహితులు, ఆటో డ్రైవర్లు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీ హాస్టల్ విద్యార్థికి ప్రభుత్వ ప్రోత్సాహకం

- ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన సృజన్‌కు రూ.10 వేల బహుమతి
- ప్రశంసా పత్రం అందజేసిన సంక్షేమ శాఖ



**వేద న్యూస్, వేములవాడ :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన విద్యార్థి వెల్దండి సృజన్ ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని అందుకున్నాడు. వెల్దండి సదానందం, భవాని దంపతుల కుమారుడైన సృజన్ హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ హాస్టల్లో ఉంటూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 477 మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి అయినప్పటికీ కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించడం విశేషంగా నిలిచింది. అత్యధిక మార్కులు సాధించిన బీసీ హాస్టల్ విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సృజన్‌కు రూ.10 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేసింది. హైదరాబాద్‌లో కలెక్టర్ ప్రియాంక చేతుల మీదుగా ఈ ప్రోత్సాహకాన్ని స్వీకరించాడు. సృజన్ సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందనలు తెలిపారు. కష్టపడి చదివితే నిరుపేద కుటుంబాల విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సృజన్ నిరూపించాడని కొనియాడారు.

# చిన్నారుల ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దు

- పిల్లలకు చ్యూయింగ్ గమ్, సిగరెట్లు, మద్యం అమ్మొద్దు
- దుకాణదారులకు ఎస్సై భైరు గోపి హెచ్చరిక

**వేద న్యూస్, కారేపల్లి :**



చిన్నారుల ఆరోగ్యం, యువత భవిష్యత్తును కాపాడేందుకు కారేపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. పిల్లలకు చ్యూయింగ్ గమ్, సిగరెట్లు, గుట్కా, ధూమపాన పదార్థాలు, మద్యపాన పదార్థాలు విక్రయిస్తే కఠిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని కారేపల్లి ఎస్సై భైరు గోపి హెచ్చరించారు. మండల ప్రజలకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు చ్యూయింగ్ గమ్ నమిలి మింగివేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, దుకాణదారులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. యువతకు సిగరెట్లు, గుట్కా, మద్యపాన పదార్థాలు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డబ్బు కోసం పిల్లల భవిష్యత్తుతో ఆటలాడొద్దు.. చిన్నారులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్సై భైరు గోపి పేర్కొన్నారు. ఈ ప్రకటనతో కారేపల్లి మండలంలో దుకాణదారులు అప్రమత్తమవుతుండగా, ప్రజలు పోలీసుల చర్యలను స్వాగతిస్తున్నారు.

# విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

- మామిడి తోటలో వైర్లు తొలగిస్తుండగా ఘటన
- మద్దులపల్లిలో విషాదం

**వేద న్యూస్, వేములవాడ రూరల్ :**



మామిడి తోటలో విద్యుత్ వైర్లు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కౌలు రైతు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వేములవాడ రూరల్ సీఐ ఎం. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన గన్నేబోయిన చంద్రయ్య (49) రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరేం గ్రామ శివారులోని ఓ మామిడి తోటను కౌలుకు తీసుకున్నాడు. తోటలో అమర్చిన విద్యుత్ వైర్లను తొలగించే క్రమంలో చంద్రయ్య వైరు చేతికి చుట్టుకుంటూ పని చేస్తున్న సమయంలో మధ్యలో ఉన్న జాయింట్ వద్ద విద్యుత్ ప్రవహించి ఎడమ చేతికి షాక్ తగిలింది. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే చంద్రయ్య మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చంద్రయ్య మృతితో మద్దులపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండలంలోని రాణంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని గురువారం వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు కాసుల సాయిలుకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోచారం భాస్కర్ రెడ్డి, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, రుద్రూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం మే 15, 2026

# లయన్ నటరాజ్ కు నియామక ఉత్తర్వులు



**వేద న్యూస్, మహబూబ్‌నగర్ :**

సావిత్రిబాయి పూలే విద్యా చారిటబుల్ ట్రస్ట్ అనుబంధ విభాగమైన అఖిల భారత శరీర అవయ దాతల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా డాక్టర్ లయన్ అంబటి నటరాజును నియమించారు. ఈ మేరకు ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి, మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ ఆనంద్ స్వరూప్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాదానం లక్ష్యంగా అనాథ, నిరుపేద విద్యార్థులకు చేయూత అందించడం, అలాగే "మరణించు జీవించు" నినాదంతో దేశవ్యాప్తంగా శరీరదానం, అవయవదానంపై అవగాహన కల్పించడం సంఘం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. మహబూబ్ నగర్‌కు చెందిన సామాజిక సేవకుడు, రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ నేత్రదానం, అవయ వదానాలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లయన్ నటరాజ్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి, ప్రొఫెసర్ ఆనంద్ స్వరూప్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటన**



**వేద న్యూస్, మంచిర్యాల:**

2026–27 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి ప్రవేశాల కోసం షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాకు రెండు సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. అభ్యర్థులు జిల్లా నివాసులై ఉండి, 2019 జూన్ 1 నుంచి 2020 మే 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం మీసేవ, మున్సిపల్ కార్పొరేషన్ లేదా తహసీల్దార్ ద్వారా జారీ చేయబడినదై ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తులతో పాటు కుల, ఆదాయ, జనన తేదీ, నివాస ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జత చేసి ఈ నెల 29 సాయంత్రం 5 గంటలలోపు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. జూన్ 1న డ్రా పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# భీమేశ్వర హుండీ ఆదాయం రూ.2 కోట్లు



**– భక్తుల నుంచి భారీగా కానుకలు**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారి హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు వెల్లడించారు. గత 44 రోజుల కాలానికి సంబంధించిన హుండీ లెక్కింపులో రూ.2,00,17,810 నగదు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. నగదుతో పాటు భక్తులు 175 గ్రాముల మిశ్రమ బంగారం, 12 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండిని హుండీలో సమర్పించారు. ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ ఏసీ కార్యాలయ ప్రతినిధి రాజమౌళి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప కార్యనిర్వహణాధికారి, సహాయ కార్య నిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల నేత రాములుకు నివాళి




**వేద న్యూస్, జమ్మికుంట:**

2011 మే 14న 57 సంవత్సరాల వయసులో క్యాన్సర్ వ్యాధి బారినపడి మరణించిన బుర్ర రాములు విద్యార్థి దశ మొదలు చివరి శ్వాస వరకూ ప్రగతిశీల ఉద్యమాల్లో, హక్కుల సంఘాల్లో కార్యకర్తగా, నాయకునిగా పని చేశారనీ మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య పేర్కొన్నారు. 1980, 90 లలో క్రూరమైన రాజ్య నిర్బంధంలో సైతం, ప్రాణాలకు వెరవకుండా తనకంటే బలహీనుల కోసం, వారి జీవించే హక్కు కోసం పోలీసులకు సవాలుగా, ముఖ్యంగా ఎన్కౌంటర్ హత్యలకు వ్యతిరేకంగా దృఢంగా నిలబడి పనిచేశారని వివరించారు. 1990ల ప్రారంభంలో పౌర హక్కుల సంఘం జిల్లా కన్వీనర్ గా, అనంతరం అధ్యక్షునిగా, తర్వాత కాలంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారనీ తెలిపారు. వరంగల్ నగరంలో కాళోజీ తర్వాత, అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడు బుర్ర రాములే అంటే ఆశ్చర్యం కాదు అని వెల్లడించారు. ఆయన జీవితాచరణే నిరంతర స్ఫూర్తిగా మనందరిలో కొనసాగుతుందని ఆశిస్తున్నామనీ పేర్కొన్నారు. బుర్ర రాములుకి జమ్మికుంట నగరంలో ఘన నివాళి అర్పించిన వారిలో మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ అచ్యుత్ కుమార్, సమ్మయ్య, కిరణ్, సదానందం, చైతన్య, కుమార్ మరియు తెలంగాణ హమాలి కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుంటి సామ్రాజ్యం, మోహన్, రచయిత మహమ్మద్ హుస్సేన్ తదితరులున్నారు.

# క్రీడా స్ఫూర్తికి సెల్యూట్

**– హుజురాబాద్ ఏసీపీ మాధవికి శుభాకాంక్షల వెల్లువ**
**– ఘనంగా పోలీస్ అధికారుల సత్కారం**




**వేద న్యూస్, హుజురాబాద్/జమ్మికుంట:**

ఓ వైపు డ్యూటీ..మరోవైపు క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ అందరికీ ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు. పోలీస్ అధికారిణిగా నిత్యం విధులు నిర్వహిస్తూనే.. గేమ్స్ పట్ల ఫోకస్ చేస్తూ.. తనలోని క్రీడా ప్రతిభకు స్వరాష్ట్రంలోనే కాదు ఇతర స్టేట్ లో కూడా గుర్తింపు లభించేలా చేశారు. విధి నిర్వహణలో నే కాదు ఆటలలో సత్తా చాటుతూ.. ఎసిపి మాధవి ముందుకెళ్తున్నారు. వివరాల్లోకి వెళితే..ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో ఆమె టేబుల్ టెన్నిస్ విభాగంలో ప్రతిభ కనబరిచి ఒక సిల్వర్ మెడల్, రెండు బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. హుజురాబాద్ సబ్ డివిజన్‌కు గర్వకారణంగా హుజురాబాద్ ఏసీపీ వి. మాధవి నిలిచారు. ఈ సందర్భంగా హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులు మేడం ను సత్కరించిఅభినందనలు తెలిపారు. మేడం సాధించిన ఈ విజయాలు పోలీస్ విభాగానికి గౌరవాన్ని తీసుకురావడమే కాకుండా, ఇతరులకుస్ఫూర్తిదాయకంగా నిలిచాయనీ కొనియాడారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ పోలీస్ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

**– పోక్సో, నీట్ లీక్ కేసుల్లో నైతిక బాధ్యత వహించాలి**
**– బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్**



**వేద న్యూస్, నల్లబెల్లి :**

పోక్సో కేసు, నీట్ ప్రశ్నాపత్ర లీకేజీ వ్యవహారాల్లో కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని బీసీ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి కొర్నెలు రమరాజ్యం డిమాండ్ చేశారు. నల్లబెల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. షేక్ బషీర్‌పేట్‌లో బండి సంజయ్ కుమారుడు భగీరథపై మైనర్ బాలిక అత్యాచార కేసులో ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. అలాగే రాజస్థాన్‌లో జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలని కోరారు. బీజేపీ హిందూ సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తూ మహిళలు, బాలికలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో విఫలమైందని విమర్శించారు. గోద్రా నుంచి మణిపూర్, ఉన్నావ్ నుంచి హత్రాస్ వరకు జరిగిన ఘటనలపై కేంద్ర ప్రభుత్వం సరైన స్పందన ఇవ్వలేదన్నారు. పోక్సో కేసులో నిందితుడిపై చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని, నీట్ లీకేజీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. గతంలో నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన రాజకీయ సంప్రదాయాలను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీకటి ప్రకాశ్, కడియాల క్రాంతికుమార్, మామిండ్ల ఐలయ్య పాల్గొన్నారు.

# పటాన్చెరు అభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే

**– స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నిధులపై చర్చ**
**– వడకపల్లి కోట అభివృద్ధికి ఎన్ఓసి ఇవ్వాలని విజ్ఞప్తి**



**వేద న్యూస్ సంగారెడ్డి :**

పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందించాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ను కోరారు. గురువారం సాయంత్రం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకుని నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా 20252026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా అవసరాలకు సంబంధించిన పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రభుత్వ సహకారం అవసరమని వివరించారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి కోట అభివృద్ధి అంశాన్ని కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కోట అభివృద్ధి కోసం ఇప్పటికే హెచ్ఎండిఏ అధికారులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ తరఫున అవసరమైన ఎన్ఓసి జారీ చేస్తే అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. హెచ్ఎండిఏ నిధులతో వడకపల్లి కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కోట అభివృద్ధి ద్వారా స్థానికంగా పర్యాటక అవకాశాలు పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అభిప్రాయపడ్డారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలను సంరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశాలపై కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెల్లడించారు. ప్రజోపయోగ కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు సమాచారం. ఈ సమావేశంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు అమలు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


**వేద న్యూస్ తుంగతుర్తి :**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం సూర్యతండా ఆవాసం గుట్టకిందతండాలో ఓ వ్యక్తి ఎస్సారెస్పీ కెనాల్ వద్ద అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. గుట్టకింద తండాకు చెందిన గుగులోతు బిచ్యా (57) కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎస్సారెస్పీ కెనాల్ వద్ద అనుమానాస్పదంగా మృతి చెందాడు. దీంతో బిచ్యా కుమారుడు గుగులోతు నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపారు.

వేద న్యూస్

శుక్రవారం మే 15, 2026

## ‘పెద్ది’ కోసం దేశవ్యాప్తంగా భారీ ప్రచారం




**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న ‘పెద్ది’ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం దేశవ్యాప్తంగా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని పెంచగా, ఇప్పుడు ప్రచార కార్యక్రమాల షెడ్యూల్ కూడా అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా మాస్ పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే విడుదలైన దృశ్యాలు స్పష్టం చేశాయి. ముఖ్యంగా కుస్తీ, క్రికెట్ నేపథ్యాల్లో సాగే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు భావిస్తున్నారు. గ్రామీణ భావోద్వేగాలు, క్రీడా స్ఫూర్తి, మాస్ యాక్షన్ అంశాలను కలగలిపి దర్శకుడు బుచ్చిబాబు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో ‘పెద్ది’పై పాన్ ఇండియా స్థాయిలో భారీ హైప్ ఏర్పడింది. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో “పెద్ది ప్రమోషన్స్ ఎక్కడ?” అంటూ ప్రశ్నించగా, దానికి స్పందించిన చిత్రబృందం ‘పవర్ ప్లే టూర్’ పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాల వివరాలను విడుదల చేసింది. ఈ టూర్‌లో భాగంగా దేశంలోని ప్రధాన నగరాల్లో వరుస ఈవెంట్లు నిర్వహించనున్నారు. మే 18న ముంబైలో జరిగే భారీ కార్యక్రమంలో సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. బాలీవుడ్ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ వేడుకను అత్యంత గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత మే 22న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో భారీ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమం జరగనుంది. ఈ ఈవెంట్‌లో ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీత ప్రదర్శన కూడా ఉండే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. భారీ సంఖ్యలో అభిమానులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. మే 23న భోపాల్‌లో ప్రత్యేక పాటల విడుదల కార్యక్రమం నిర్వహించనుండగా, మే 24న బెంగళూరులో మరో ప్రచార వేడుక జరగనుంది. ఇక మే 28న ఢిల్లీలో, మే 30న చెన్నైలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జూన్ 1న విజయనగరంలో అభిమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. సినిమా కథ ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగనున్న నేపథ్యంలో విజయనగర కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. చివరగా జూన్ 2న హైదరాబాద్‌లో భారీ ప్రీ రిలీజ్ వేడుకను అభిమానుల సమక్షంలో నిర్వహించనున్నారు.అభిప్రాయపడుతున్నారు.

## బన్నీతో మూడోసారి పూజా హెగ్డే జోడీ?



**వేద న్యూస్ డెస్క్:**

మంగళూరు భామ పూజా హెగ్డేకు టాలీవుడ్‌లో మళ్లీ మంచి అవకాశాలు వరుసగా వస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత కొంతకాలంగా సరైన భారీ విజయానికి ఎదురుచూస్తున్న ఈ స్టార్ హీరోయిన్ ఇప్పుడు కథల ఎంపికలో చాలా జాగ్రత్తగా ముందుకెళ్తున్నారని తెలుస్తోంది. వరుసగా పాన్ ఇండియా ప్రాజెక్టులు, స్టార్ హీరోల సినిమాలపై దృష్టి పెట్టిన పూజా.. మళ్లీ టాలీవుడ్‌లో తన స్థానాన్ని బలపరుచుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో నటిస్తున్న పూజా హెగ్డే.. తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సరసన మరోసారి హీరోయిన్‌గా నటించే అవకాశాన్ని దక్కించుకున్నట్లు ఫిల్మ్‌నగర్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌కు ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి క్రేజ్ ఉండటంతో ఈ వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం అల్లు అర్జున్ సైంటిఫిక్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ‘రాకా’ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం పూర్తయ్యిన తర్వాత తమిళ స్టార్ దర్శకుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో బన్నీ ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ చేయనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయని సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పూజా హెగ్డే పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కథకు తగ్గ గ్లామర్, నటన, స్క్రీన్ ప్రెజెన్స్ దృష్ట్యా దర్శకుడు లోకేష్ కూడా పూజా వైపు ఆసక్తి చూపుతున్నారని టాక్ వినిపిస్తోంది. ఒకవేళ ఈ ప్రాజెక్టు ఖరారైతే అల్లు అర్జున్, పూజా హెగ్డే కాంబినేషన్‌లో ఇది మూడో సినిమా అవుతుంది. ఇప్పటికే వీరిద్దరూ కలిసి నటించిన ‘డీజే’, ‘అల వైకుంఠపురములో’ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సాధించాయి. ముఖ్యంగా ‘అల వైకుంఠపురములో’ చిత్రం తర్వాత ఈ జంటకు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పడింది. స్క్రీన్‌పై వీరిద్దరి కెమిస్ట్రీకి అభిమానులు ఫిదా అయ్యారు. పాటలు, రొమాంటిక్ సన్నివేశాలు, డ్యాన్స్‌లలో ఈ జంట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల కాలంలో కొన్ని సినిమాలు ఆశించిన విజయాలు అందుకోకపోయినా పూజా హెగ్డేకు స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు మాత్రం తగ్గలేదని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా పాన్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శక నిర్మాతలు ఆమెను ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్‌లో సమానంగా అవకాశాలు అందుకుంటున్న పూజా ఇప్పుడు మళ్లీ తెలుగులో బలమైన కమ్‌బ్యాక్ కోసం ప్రయత్నిస్తున్నారని సమాచారం. మరోవైపు అల్లు అర్జున్ కూడా ‘పుష్ప’ సిరీస్ తర్వాత తన తదుపరి సినిమాల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. కొత్త కథలు, విభిన్న పాత్రలు, అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ స్టాండర్డ్స్‌తో సినిమాలు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కబోయే చిత్రం కూడా భారీ స్థాయిలో ఉండబోతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే పూజా హెగ్డే ఎంపికపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. త్వరలోనే చిత్ర బృందం హీరోయిన్‌తో పాటు ఇతర నటీనటుల వివరాలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ వార్తతో బన్నీ అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. వీరిద్దరి హిట్ కాంబినేషన్ మరోసారి తెరపై కనిపిస్తే బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు రావచ్చని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఎయిర్‌పోర్ట్‌లో శోభిత సరదా కామెంట్ వైరల్



**వేద న్యూస్ డెస్క్:**

అక్కినేని హీరో నాగచైతన్య, నటి శోభిత ధూళిపాళ జంట ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పెళ్లి తర్వాత ఈ జంట ఎక్కడ కనిపించినా అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంటోంది. తాజాగా విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న ఈ జంట ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో జరిగిన చిన్న సరదా సంభాషణ కారణంగా మరోసారి వార్తల్లో నిలిచింది. నిన్న అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న నాగచైతన్య, శోభితలను చూసేందుకు అభిమానులతో పాటు మీడియా ప్రతినిధులు కూడా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సెలబ్రిటీలు ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్నారనే సమాచారం అందిన వెంటనే ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు అక్కడికి చేరుకోవడం సాధారణమే. ఈ క్రమంలో చై-శోభిత జంట బయటకు వస్తుండగా కెమెరాలు వరుసగా క్లిక్‌మనిపించాయి. నాగచైతన్యతో కలిసి ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తున్న శోభిత ధూళిపాళ, అర్ధరాత్రి అయినా మీడియా అక్కడే ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే చిరునవ్వుతో మీడియా ప్రతినిధుల వైపు చూస్తూ.. “మీరు అస్సలు నిద్రపోరా?” అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె చెప్పిన తీరు అక్కడున్న వారిని ఒక్కసారిగా నవ్వుల్లో ముంచెత్తింది. శోభిత వ్యాఖ్య విన్న నాగచైతన్య కూడా చిరునవ్వు చిందించడం వీడియోలో స్పష్టంగా కనిపించింది. అనంతరం అభిమానులకు చేతులు ఊపుతూ ఈ జంట అక్కడి నుంచి కారులో వెళ్లిపోయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. “శోభిత చాలా సహజంగా మాట్లాడింది”, “మీడియా కష్టాన్ని సరదాగా గుర్తుచేసింది”, “చై-శోభిత జంట చాలా క్యూట్‌గా ఉంది” అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కొందరు అభిమానులు ఈ జంట సింప్లిసిటీని ప్రశంసిస్తుండగా, మరికొందరు వీరిద్దరి అన్యోన్యత ఆకట్టుకుంటోందని అభిప్రాయపడుతున్నారు. తెనాలికి చెందిన శోభిత ధూళిపాళ మోడలింగ్ రంగం ద్వారా తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బాలీవుడ్, తెలుగు, తమిళం, మలయాళం వంటి పలు భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. తన అందం, నటన, ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో తక్కువ సమయంలోనే సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఇటీవల అక్కినేని కుటుంబంతో ఆమెకు ఏర్పడిన అనుబంధం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో ఆమెకు మరింత క్రేజ్ పెరిగింది. ఇక నాగచైతన్య కూడా వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు. వ్యక్తిగత జీవితంలో కొత్త దశలోకి అడుగుపెట్టిన తర్వాత ఆయన మరింత ప్రశాంతంగా కనిపిస్తున్నారని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. తరచూ కలిసి కనిపిస్తున్న నాగచైతన్య-శోభిత జంట సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్న ఈ జంటపై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది.

## చిన్న వయసులోనే పెళ్లి.. కెరీర్‌పై ఆనంది ఆసక్తికర వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**




సినీ పరిశ్రమలో హీరోయిన్‌ల కెరీర్, వివాహం గురించి ఉన్న సాధారణ అభిప్రాయాలపై నటి ఆనంది ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పెళ్లి చేసుకున్న తర్వాత హీరోయిన్‌ల కెరీర్ దెబ్బతింటుందనే భావన ఇప్పటికీ చాలామందిలో ఉందని ఆమె పేర్కొన్నారు. అయితే తన జీవితమే ఆ అభిప్రాయాలకు సమాధానమని చెప్పిన ఆనంది.. పెళ్లి, పిల్లలు, కెరీర్ మధ్య ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆనంది.. సినిమాల్లో కూడా హీరోయిన్‌ల పెళ్లిపై పలు అపోహలను చూపిస్తుంటారని అన్నారు. “కొన్ని సినిమాల్లో హీరోయిన్ పెళ్లి చేసుకుంటే కెరీర్ ముగిసినట్టే అన్న భావన కనిపిస్తుంది. ఇప్పటికీ చాలామంది అదే అనుకుంటున్నారు. చాలా మంది నటీమణులు 35 లేదా 38 ఏళ్ల తర్వాతే వివాహం చేసుకుంటున్నారు. కొందరు అయితే పెళ్లి చేసుకోకుండా కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నారు” అని చెప్పారు. అయితే తాను మాత్రం చాలా చిన్న వయసులోనే వివాహం చేసుకుని కూడా కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నానని ఆనంది తెలిపారు. “నేను 23 ఏళ్లకే పెళ్లి చేసుకున్నాను. అయినా నా కెరీర్‌కు ఎలాంటి ఇబ్బంది రాలేదు. ఇండస్ట్రీలో ఒకరిని నిలబెట్టేది టాలెంట్, నటన, పనితీరు మాత్రమే. పెళ్లి చేసుకున్నామా లేదా అన్నది కాదు” అని స్పష్టం చేశారు.తన వివాహం గురించి మాట్లాడుతూ.. అది కుటుంబ సభ్యుల అభిప్రాయం, తన నిర్ణయం రెండింటి కలయిక అని వెల్లడించారు. “నా తల్లిదండ్రులు అదే సరైన సమయం అనుకున్నారు. “మా తల్లిదండ్రులకు కూడా ఆయన నచ్చారు. అలా మా పెళ్లి కుదిరింది. ఇది పెద్ద ప్రేమకథ కాదు. నేరుగా పెళ్లి ప్రపోజల్ వచ్చింది” అని నవ్వుతూ చెప్పారు. డబ్బు, ఆస్తుల కంటే వ్యక్తిత్వానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని ఆనంది స్పష్టం చేశారు. “నాకు బిలియనీర్లు, మిలియనీర్లు అవసరం లేదు. బంగ్లాలు, కార్లు నేను స్వయంగా సంపాదించుకోగలను. జీవిత భాగస్వామిలో మంచి మనసు, అర్థం చేసుకునే స్వభావం ఉండటం ముఖ్యం” అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చిన్న వయసులో పెళ్లి చేసుకుని కూడా కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న ఆమె నిర్ణయాన్ని చాలామంది ప్రశంసిస్తున్నారు.

## ‘స్పిరిట్’ కోసం భారీ పోలీస్ స్టేషన్ సెట్‌లో ప్రభాస్ సందడి

**వేద న్యూస్ డెస్క్:**




రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ‘స్పిరిట్’ సినిమా షూటింగ్‌లో ఫుల్ బిజీగా ఉన్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా కొనసాగుతోంది. ఈ షెడ్యూల్ కోసం ప్రత్యేకంగా నిర్మించిన భారీ పోలీస్ స్టేషన్ సెట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దాదాపు 60 రోజుల పాటు కొనసాగే ఈ దీర్ఘ షెడ్యూల్‌లో సినిమాకు అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ‘స్పిరిట్’ సినిమాలో ప్రభాస్ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటివరకు ఆయన చేసిన పాత్రలతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నంగా ఉండబోతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో ప్రభాస్‌ను మరింత ఇంటెన్స్, అగ్రెసివ్ అవతార్‌లో చూపించేందుకు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. పోలీస్ అధికారిగా ప్రభాస్ బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, యాక్షన్ స్టైల్ అభిమానులకు కొత్త అనుభూతిని కలిగిస్తాయని టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరిస్తున్న షెడ్యూల్‌లో ప్రధానంగా ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. కథలో ట్విస్టులు తీసుకువచ్చే పలు సన్నివేశాలు ఈ సెట్లోనే షూట్ చేస్తున్నారని సమాచారం. పోలీస్ స్టేషన్ వాతావరణాన్ని అత్యంత రియలిస్టిక్‌గా రూపొందించేందుకు ఆర్ట్ డిపార్ట్‌మెంట్ భారీగా ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. సెట్ డిజైన్, లైటింగ్, యాక్షన్ కంపోజిషన్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం భావిస్తోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073